

వరంగల్ శివనగర్‌లో
సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

- అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా బీఆర్ఎస్ ప్రణాళిక
- పేదలు, మహిళలకు పెద్దపీటపై సర్వత్రా హర్షం
- బీఆర్ఎస్ మేనిఫెస్టోను స్వాగతిస్తున్న సబ్బండ వర్గాలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గులాబీ శ్రేణుల సంబురాలు
- పటాకులు కాల్చి, స్వీట్లు పంచిన నాయకులు, కార్యకర్తలు



కాశీబుగ్గ : సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



కాజీపేట చౌరస్తాలో సంబురాలు జరుపుకుంటున్న గులాబీ శ్రేణులు

# మేనిఫెస్టో సంబురం



వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో సంబురాలు చేసుకుంటున్న మహిళలు



వరంగల్ ఎంజీఎం కూడలిలో డప్పుచప్పుళ్లతో నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

*వరంగల్, అక్టోబర్15(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/వరంగల్, (నమస్తే తెలంగాణ):* భారత రాష్ట్ర సమితి మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. అన్ని వర్గాల వారిని సంతృప్తి పరిచేలా ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఆదాయం పెంచాలి... పేదలకు పంచాలనే విధానంతో తొమ్మిదన్నరేండ్లుగా పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. మన నిధులు మనకే అనే నినాదాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి ఊరును, బస్తీని సమగ్రంగా అభివృద్ధి చేసింది. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధికి కొనసాగింపుగా సంక్షేమ పథకాలను మరింత విస్తృతం చేస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ మేనిఫెస్టోను ప్రకటించారు. దీన్ని ముఖ్యంగా పేదలు, మహిళలు పూర్తి స్థాయిలో స్వాగతిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తామనడం, తెల్లకార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అమలు చేస్తామనడంపై పేద వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. వృద్ధాప్య, దివ్యాంగ పెన్షన్లు పెంచడం, రైతు బంధు కింద పెట్టుబడి సాయాన్ని పెంచుతామని పేర్కొనడంపై ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అర్హులైన మహిళలకు ప్రతి నెల రూ.3 వేల చొప్పున భృతి, పేద మహిళలకు రూ.400కు గ్యాస్ సిలిండర్, మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు నిర్మించనున్నట్లు మేనిఫెస్టోలో పేర్కొనడంపై నారీలోకం వేనోళ్ల పొగుడుతున్నది. ఆరోగ్యశ్రీ కింద వైద్యం కోసం అందించే మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచడం, అగ్రవర్ణాల్లోని పేద పిల్లల చదువుల కోసం నియోజకవర్గానికో గురుకులాన్ని నెలకొల్పడం, ఉద్యోగుల సీపీఎస్‌పై అధ్యయన కమిటీని నియమించనున్నట్లు తెలపడంతో హర్షం వ్యక్తమవుతున్నది. అన్ని వర్గాలకు మరింత తోడ్పాటు అందించేలా ఉండడంతో సర్వత్రా చర్చ జరుగుతున్నది. మేనిఫెస్టోపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబురాలు నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద పటాకులు కాల్చారు. డప్పు చప్పుళ్లతో ర్యాలీలు తీశారు. ఊరూరా, వాడవాడనా బీఆర్ఎస్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు.



నర్సంపేటలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు



జనగామలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## భద్రకాళీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

వరంగల్,అక్టోబర్ 15: భద్రకాళీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆలయ ఈవో శేషుభారతి జ్యోతి ప్రజ్వలన చేసి, ఉత్సవాలను ప్రారంభించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు భద్రకాళీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

**బాలత్రిపురా సుందరి అలంకరణలో అమ్మవారు**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురా సుందరి అలంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.



దేవీ ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆలయ ఈవో శేషుభారతి



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

## సర్వజన సంక్షేమం కోసమే మేనిఫెస్టో

- అన్ని వర్గాలకు లబ్ధి చేకూరేలా రూప కల్పన
- దేశంలోనే గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్
- కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్
- కాళోజీ సెంటర్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

హనుమకొండ, అక్టోబర్ 15: సర్వజన సంక్షేమం కోసమే బీఆర్ఎస్ మేనిఫెస్టో అని కుడా చైర్మన్ సంఘంరెడ్డి సుందర్‌రాజు యాదవ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా ఆదివారం హనుమకొండలోని కాళోజీ సంటర్ వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణలతో కలిసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. ఎన్నికల కోసం కాకుండా ప్రజా సంక్షేమంతో పాటు అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టో ఉందన్నారు. ప్రస్తుతం అందిస్తున్న రూ. 2016 ఆసరా పింఛన్‌ను రూ. 5 వేలకు, రూ. 4016 దివ్యాంగుల పింఛన్‌ను రూ. 6 వేలకు దశలవారి పెంచే నిర్ణయం అభినందనీయన్నారు. అదే విధంగా రైతు బంధును రూ. 10వేల నుంచి 16వేలకు పెంచారన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు ప్రతి నెలకు రూ. 3వేలు ఇవ్వడంతో పాటు రూ. 400లకే గ్యాస్ సిలండర్ అందజేస్తున్నట్లు ప్రకటించి నిరుపేదలపై ఆయన అభిమానాన్ని చాటుకున్నారన్నారు. కేసీఆర్ ఆరోగ్య రక్ష పథకం ద్వారా వైద్య సహాయంగా రూ. 15 లక్షలు ఇవ్వనున్నామని, స్థలం లేని వారికి ప్రభుత్వ స్థలం అందిస్తామని, అనాథ పిల్లలకు ప్రత్యేక ప్రణాళిక, అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తామని, ఉద్యోగుల పాత పెన్షన్ విధానం అమలుకు కమిటీ ఏర్పాటు చేస్తామని, అలాగే అగ్ర వర్గాలలోని వారికి రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు సీఎం కేసీఆర్ మేనిఫెస్టో ప్రకటించడం అభినందనీయమన్నారు. ఓరుగల్లు నగరం ఇప్పటికే ఎడ్యుకేషనల్, హెల్త్, ఐటీ, కల్చరల్ హబ్‌గా మారిందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో దాస్యం వినయ్ భాస్కర్ గెలువడంతో పాటు తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, నెక్కొండ కిషన్, డివిజన్ అధ్యక్షులు సుగుణాకర్ రెడ్డి, రాజు, కోటేశ్వర్, అనిల్, బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హనుమకొండ కాళోజీ సెంటర్ వద్ద కార్యకర్తకు స్వీటు తినిపిస్తున్న కుడా చైర్మన్ సుందర్‌రాజ్